క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్‌లో ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఇది చక్కని వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన వినతులను సకాలంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాచిపెంట: మండలంలో తులసిజోగివలస గ్రామంలో తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. దివంగత బొడ్డేపల్లి లక్ష్మి జ్ఞాపకార్థం గ్రామంలో సుమారు 40 మంది పేదలకు వాటిని పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు రామకృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఎయిర్ వెటరన్ సాగినారాయణరాజు, కిరణం మహిళా సమైఖ్య సంఘం సిబ్బంది ఫాతిమ, సాయిలక్ష్మి, శ్రీనివాసరావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లు పట్టివేత



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో ఎక్సైజ్ సిబ్బంది

సీతానగరం/గరుగుబిల్లి: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. గరుగుబిల్లి మండలం కొంకడివరం గ్రామ సమీపంలో ఆదివారం దాడులు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 80 సారా ప్యాకెట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోద చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం, సారా అక్రమంగా నిల్వ చేసిన, విక్రయించిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం బెల్టుషాపులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

పిక్నిక్‌ల సందడి



ఆటలాడుకుంటున్న చిన్నారులు

బలిజిపేట: కార్తీకమాసం కావడంతో పిక్నిక్‌ల సందడి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఉన్న తోటలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. చిన్నారులు, పెద్దలు అందరూ ఆటపాటలతో సరదాగా గడిపారు. సామూహిక వనభోజనాలు చేశారు. సమీప నదిలో, వాగుల్లో జలకాలాడారు. దగ్గరలోని ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను ఆదుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను ప్రభుత్వం ఆదుకోవాలని గుమ్మలక్ష్మీపురం మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ కనీస వేతనాలకు, ఉద్యోగ భద్రతకు వారు నోచుకోవడం లేదన్నారు. ఎప్పటికైనా వేతనం పెరుగుతుందనే ఆశతో ఆర్థిక ఇబ్బందులతోనే వారంతా కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, అయినా ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వారంతా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని గత ఐదు రోజులుగా చేపడుతున్న నిరసన సమ్మెలు చేపడుతున్నారని, వారి సమ్మె వలన విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పరామర్శ

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పాట్నూరు లక్ష్మణరావు తండ్రి అచ్చెంనాయుడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం గ్రామానికి చేరుకుని లక్ష్మణరావును పరామర్శించారు. అచ్చెంనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, సతివాడ చిన్నంనాయుడు, వైశ్యరాజు గోవిందరాజు, అలజంగి ఏలియా, పాట్నూరు పరిసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దేవతలు కొలువైన కొండ


- పారమ్మకొండపై నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం
- వేల సంఖ్యలో హాజరుకానున్న భక్తులు
- కోటి పదిలక్షల బీజాక్షరాలతో రాష్ట్రంలోనే ఎత్తైన శ్రీచక్రం
- అరుణాచలం తరువాత పారమ్మకొండపైనే కృత్తికా దీపోత్సవం ప్రత్యేకం

సాలూరు:

పాచిపెంట మండలం చీపురువలస సమీపంలో శివలింగాకారంలో ఉన్న పారమ్మకొండ శివపార్వతుల కల్యాణోత్సవానికి వేదికయ్యింది. ఈ కొండపై పార్వతీదేవి కొలువై ఉందని భక్తుల విశ్వాసం. అందుకే దీన్ని పారమ్మకొండగా పిలుస్తారు. ఏటా కార్తీకమాసంలో చివరి సోమవారం నాడు ఈ కొండపై వేలసిన పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకను చూసేందుకు ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. సోమవారం వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు. పలు ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఉత్సవ ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.



కొండపై వెలసిన పారమ్మతల్లి



పారమ్మకొండ

ఇదీ చరిత్ర

భారీ శివలింగాకారంలో ఉండే ఈ పారమ్మకొండపై 32 చేతులతో ఆయుధాలు ధరించి శిరస్సుపై శివుడిని కలిగి ప్రత్యేకంగా ఉండే అమ్మవారి విగ్రహాన్ని మొదటగా దేవతలు ప్రతిష్ఠించి పూజించారని భక్తుల విశ్వాసం. సుమారు 2400 సంవత్సరాల కిందటే ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉండొచ్చని పురావస్తుశాఖ అధికారులు నిర్ధారించారు. ఇక్కడ గుహలోనే పాండవులు వనవాసం ఉండేవారని, అందుకే ఆ గుహను పాండవుల గుహగా పేర్కొంటారు. జైనుల పురాతన గ్రంథాల్లోనూ ఈ పారమ్మతల్లి ప్రస్తావన ఉంది. మొదటగా పారమ్మతల్లికి పూజలు చేసింది ఈ ప్రాంత గిరిజనులే. తమ కోర్కెలు నెరవేరడంతో ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య క్రమేపీ పెరిగింది. అమ్మవారు ఒక్కో సమయంలో ఒక్కో రూపంలో దర్శనమిస్తుందని, అమ్మను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం.

ప్రత్యేకతలు

అమ్మవారి కొండకు వెళ్లే మార్గంలో అమ్మవారి పాదాల వద్ద మొదటగా శ్రీగణపతి దర్శనమిస్తారు. తరువాత పరమశివుడు శ్రీభువనేశ్వరి సమేతంగా కనిపిస్తారు. ఇంకా ముందుకు వెళితే లలితాదేవి 13 అడుగుల శ్రీచక్ర రూపంలో దర్శనమిస్తారు. 2008లో కొండపై శ్రీచక్రాన్ని ఏర్పాటుచేశారు. ఇంత ఎత్తైన శ్రీచక్రం రాష్ట్రంలోనే లేదని, ఇందులో కోటి పది లక్షల బీజాక్షరాలు భక్తులు చేత రాయించి నిక్షిప్తం చేసినట్లు తెలుస్తుంది. ఈ కొండ నాగశక్తికి ప్రతీతి. ఇక్కడ ప్రత్యేక నాగమందిరాలు ఉన్నాయి. అరుదైన విశేష సర్పజాతులు ఉన్నాయి. 2006లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని ఈ కొండపై నిర్మించారు. ఏటా సుబ్రహ్మణ్య షష్ఠి, శ్రీవల్లి కళ్యాణం, శివపార్వతుల కళ్యాణాన్ని ఈ కొండపై వైభవంగా నిర్వహిస్తుంటారు.

సుందరమైన ప్రకృతి

ఈ కొండ ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి శోభాయమనంగా కనిపిస్తుంది. వర్షం పడిన సమయంలో ఈ కొండపై నుంచి ముఖ్యంగా మూడు పాయలతో ఉవ్వెత్తున నీరు ప్రవహిస్తుంది. ఈ నీటి ఘోష కిలోమీటర్ల దూరం వరకూ వినిపిస్తుంది. దీనికి సంబంధించి ఓ కథ కూడా ఉంది. దట్టమైన అటవీప్రాంతంగా ఉండే ఈ కొండపై మేకలు మేపుతున్న గొల్లవాడు గతంలో అక్కడ అమ్మవారి విగ్రహం వద్దకు పాలు తీసుకువెళ్తుండేవాడు. ప్రతి దినం వలే ఓ రోజూ కొండపైకి సట్టిలులో (కూజా వంటి ప్రత్యేక మట్టి పాత్ర) పాలు తీసుకువెళ్తుండగా గొల్లవాడు కాలుజారి సట్టి పగిలిపోయింది. ఆ పాలు మూడు పాయలుగా విడిపోయాయి. ఈ పాయల గుండానే వర్షం పడిన సమయంలో నీరు ప్రవహిస్తున్నట్లు భక్తులు తెలుపుతున్నారు. వర్షం తెరిపిచ్చిన సమయంలో ఈ కొండ వెండి పూత వర్ణంతో మెరిసిపోతూ కనిపిస్తుంది. ఈ సమయంలో సూర్యకాంతి పడినట్లయితే కొండను చూస్తే నయనానందం కలుగుతుంది.

మనుషులు తాకే మబ్బులు

కొండపై పూజలు చేస్తున్న భక్తులకు దట్టమైన మేఘాలు కొండచుట్టూ కప్పివేయడంతో ఆ మబ్బులను తాకే అనుభూతి అక్కడ ఉన్న భక్తులకు కలుగుతుంది. అమ్మవారికి జరుగుతున్న కార్యక్రమాలను చూచేందుకు మబ్బులు వస్తుంటాయని భక్తులు అంటుంటారు.

భక్తులు తాకిడి

ఈ కొండకు అధిక సంఖ్యలో భక్తుల తాకిడి కనిపిస్తుంటుంది. కొంతమంది సిద్దులు, యోగులు, రుషీశ్వరులు కొండపైకి వచ్చి ధ్యానం చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కుండలిని జాగృతమై యోగంలో ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని వారు విశ్వసిస్తుంటారు. కొందరు దిగంబర స్వాములు కూడా ఇక్కడకు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారని భక్తులు చెపుతున్నారు. మహాశివరాత్రి నాడు, కార్తీక మాసంలో ఉపవాసంతో ఈ కొండపైకి ఎక్కి అమ్మవారిని దర్శించుకుంటే కోరుకున్న కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

ప్రత్యేక దినాల్లోనే కొండపైకి

ఈ కొండపైకి ప్రత్యేక దినాల్లో మాత్రమే భక్తులు ఎక్కగలుగుతారు. సాధారణ సమయాల్లో ఈ కొండపైకి ఎక్కడం గగనమే. దీనికి స్థానికుల సహాయం తప్పనిసరి. అరుణాచలం తరువాత పారమ్మకొండపైన కృత్తికా దీపోత్సవం నిర్వహించడం విశేషం.

ప్రత్యేక ఆకర్షణలు

32 చేతులతో దర్శనమిచ్చే అమ్మవారి విగ్రహం, ప్రత్యేక దినాల్లో కొండపై వెలిగించే అఖండ జ్యోతి, పాండవుల గుహ, ఏడాది పొడవునా కొండ మధ్యలో నుంచి ప్రవహించే ఆకాశగంగ, తదితర అనేక ప్రత్యేకతలు ఈ కొండకు అలంకరణలు. కొండమీదకు వెళ్లలేని భక్తుల కోసం కొండ కిందనే అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.



పాండవుల గుహలో ఉన్న విగ్రహాలు



పారమ్మకొండను తాకిన మబ్బులు

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- రెడ్డి శ్రీదేవి ఐద్వా జిల్లా కార్యదర్శి

పార్వతీపురంటౌన్: దేశంలో, రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులకు రక్షణ కరువైందని ఐద్వా జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీదేవి అన్నారు. విశాఖలో లా విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడిని ఖండిస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలోని బాలికల వసతిగృహాల్లో ఆదివారం ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలకత్తా ట్రైనీ డాక్టర్ ఘటన మరువకముందే విశాఖలో లా విద్యార్థినిపై క్రూరమైన దాడి జరగడం చాలా దారుణమన్నారు. మహిళలపై దాడులకు విశాఖపట్నం అడ్డాగా మారుతోందని, విశాఖలో జరిగిన దాడి సమాజం తల దించుకునేటట్లు ఉందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించాలి..

ఈ మధ్య రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న దాడులలో సుమారుగా 96 మంది వరకు మహిళలు బలిపశువులుగా మారారని, దీనిపై కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతోందని ఆరోపించారు. దీని వల్ల యువత పెడతోవ పడుతోందని, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రైవేట్, కార్పొరేట్ విధానాల వల్లే..

అనంతరం శ్రామిక మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి ఇందిర మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విధానాల వల్లనే మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. ఏక్కడో ఒకచోట ప్రతిరోజు మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, మద్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని, పోర్న్ వెబ్ సైట్లను రద్దు చేయాలని, పోక్సో చట్టం ద్వారా వెంటనే విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జస్టిస్ వర్మ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు టి.అఖిల్, జిల్లా జాయింట్ సెక్రటరీ పి.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు హెచ్.సింహాచలం, కె.డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీదేవి

ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలి

- ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: మండల విద్యాశాఖ అధికారులకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ప్రభుత్వాన్ని కోరారు. ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని ఆదివారం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సామల మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారిగా దాదాపు 150 నుంచి 300 మంది టీచర్ల జీతభత్యాలను డ్రాచేస్తున్న ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. విద్యాశాఖ తరపున అనేక కార్యక్రమాలను ఎంఈఓలు నిర్వహిస్తుండగా, ఎంపీడీఓలు తమ శాఖకు సంబంధంలేని అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో ఎంఈఓలు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా జీఓ నెంబర్ 89కు విరుద్ధంగా డీఈఓలు అన్ని విధులను ఎంఈఓ-1లే చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. జీఓ నెంబర్ 89 ప్రకారం జాబ్ చార్ట్ కచ్చితంగా అమలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యలపై ఇప్పటికే విద్యాశాఖ మంత్రికి, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు డి.పుల్లయ్య, ఓబులేసు, ధనుంజయ మజ్జి, రవిశంకర్, మన్సూర్ భాష, గంగిరెడ్డి, పద్మలత, రామారావు, శ్రీనివాస్ నాయక్‌తో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి గౌతమ్ అదానీని అరెస్టు చేయాలన్నారు. ప్రభుత్వం అదానీకి ఇచ్చిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రజల సంపదను కాపాడాలన్నారు. అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను బహిర్గతం చేయాలని, వాటని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంపద పరిరక్షణకు ప్రజలంతా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుడితి అప్పలనాయుడు, యు.మన్మథరావు, తోట జీవన్, కొలల్లి సాంబమూర్తి, శ్రీనునాయుడు, గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, వి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సీతానగరం: మండలంలోని రైతులకు రబీ సీజన్‌లో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని లైసెన్స్‌డ్ ఎరువుల దుకాణాల్లో ఉన్న నిల్వలను ఆదివారం ఆయన పరిశీలించారు. రికార్డులు, స్టాక్‌ను తనిఖీ చేశారు. మరిపివలసలోని వేంకటేశ్వర ఎరువుల షాపులో యూరియా 16.2 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు చెప్పారు. అలాగే బూర్జలోని విజయరామ ఫెర్టిలైజర్స్‌లో 22.17 మెట్రిక్ టన్నుల యూరియా, 33.45 మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.50 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 8.15 మెట్రిక్ టన్నుల సంకీర్ణ ఎరువులు ఉన్నట్లు చెప్పారు. మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో యూరియా 104.53 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 20 మెట్రిక్ టన్నులు, సంకీర్ణ ఎరువులు 20.5 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయించే డీలర్లపై రైతులు ఫిర్యాదు చేయాలని కోరారు.



మరిపివలసలో ఎరువుల దుకాణంలో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ అవినాష్

పంచారామాలకు ప్రత్యేక సర్వీస్‌లు

పాలకొండ రూరల్: రాష్ట్రంలోగల ప్రముఖ పంచారామాలను దర్శించుకునేందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు నిర్వహిస్తున్నట్లు పాలకొండ డిపో సహాయ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం స్థానిక డిపో నుంచి 37 మందితో ఓ బస్సు బయలుదేరింది. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకుని, తిరిగి పట్టణానికి చేరుకోవచ్చని సిబ్బంది తెలిపారు. భక్తులు నేరుగా కూడా బస్సు బుక్ చేసుకోవచ్చన్నారు.

రహదారికి మరమ్మతులు

- సాక్షి స్పందన

పాలకొండ రూరల్: పాలకొండ వయా వీరఘట్టం మీదుగా జిల్లా కేంద్రమైన పార్వతీపురం వెళ్లే రహదారిలో ఏర్పడిన గోతులను అధికారులు ఆదివారం పూడ్చారు. రహదారులు అధ్వానంగా ఉండడంతో ఇటీవల సాక్షిలో 'ఛిద్రమైన రోడ్లతో అవస్థలు' పేరిట ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈక్రమంలో రాయుడు కోనేరు, అగ్నిమాపక కేంద్రం, గజాల ఖానా, తుమరాడ, గ్యాస్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో జేసీబీ సాయంతో గోతులను పూడ్చారు. త్వరలోనే శాశ్వత మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

బీటీరోడ్డు పనులు వేగవంతం

సీతానగరం: మండల పరిధిలో ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. నిడగల్లు నీలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి ముత్యాలదొరవలస వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిడగల్లు-ముత్యాలదొరవలస, సుమిత్రిపురం నుంచి వల్లరిగుడబ, బగ్గందొరవలస జంక్షన్ నుంచి కొత్తవలసకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఇటీవల ఎమ్మెల్యే బి.విజయచంద్ర భూమిపూజ చేశారని తెలిపారు. రూ.6 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. బగ్గందొరవలస జంక్షన్ నుంచి కొత్తవలస బీటీరోడ్డు పనులకు నిడగల్లు వద్ద ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎర్త్‌వర్కు జరుగుతున్నాయని తెలిపారు. ప్రారంభించిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



నిడగల్లు బీటీ రోడ్డు ఎర్త్‌వర్క్ పనులు

నేరాల నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ఎం.రాజేష్

సీతానగరం: సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిరోధానికి ప్రజలు సహకరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ కోరారు. పణుకుపేటలో రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం పాడవుతుందని, భవిష్యత్ అంధకారంగా మారుతుందని అన్నారు. అపరిచితుల నుంచి మీ ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని, వాటిని ఓపెన్ చేయడం ద్వారా మీరు సైబర్ మోసగాళ్ల వలలో పడే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాల్చితే కాలుష్యం..
దున్నితే సారవంతం

- వరి కొయ్యలను కలియ దున్నితే లాభాలు : వ్యవసాయాధికారులు

భామిని: ప్రస్తుతం వరి కోతలు, నూర్పిడి పనులు పూర్తి చేసుకుంటున్న రైతులు ధాన్యం విక్రయించే ప్రయత్నాల్లో ఉన్నారు. యంత్రాల సహాయంతో తక్కువ కాలంలోనే నూర్పిడి పనులు పూర్తి చేసుకున్నారు. అయితే రెండో పంటగా రబీ వరి, ఇతర పంటలు వేయడానికి సిద్ధమవుతున్న రైతులు పొలాల్లో విడిచిన వరి కొయ్యలు, పడిపోయిన గడ్డిని తగులబెడుతున్నారు. సారవంతమైన వరి కొయ్యలను అగ్నికి ఆహుతి చేసి పొలాన్ని బూడిదతో, వాతావరణాన్ని కాలుష్యంతో నింపుతున్నారని వ్యవసాయాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుకు అవగాహన లేకపోవడంతో సారవంతమైన మట్టిలో నీటి శాతం నాశనం చేసుకుంటున్నాడని చెబుతున్నారు. కోత, నూర్పిడి యంత్రాల నుంచి పడిన వరి గడ్డి పొలాల్లో గట్లుగా, వరుస బోదెలుగా పడుతుంది. అయితే రబీ సాగుకు అనువుగా పొలంలోని గడ్డి కుప్పలను తగులబెట్టడం వల్ల పొలానికి తీవ్ర నష్టం జరగనుంది. భూమిలోని నీటి శాతం తగ్గిపోవడంతో పాటు సూక్ష్మజీవులు నశిస్తాయి.

యంత్రాల వల్లే..

ప్రస్తుతం పంట కోతలకు యంత్రాలు ఉపయోగించడంతో వరిచేనును 30 సెంటీమీటర్ల ఎత్తులో కోస్తున్నాయి. 50 శాతం గడ్డి కొయ్యల రూపంలో పంట అవశేషాలు మిగిలిపోతున్నాయి. ఎకరాకు రెండు టన్నుల మేర వరి కొయ్యలు గడ్డిరూపంలో మిగిలి పోతున్నాయి. వీటిని రైతులు కాల్చడం వల్ల పర్యావరణంలో పెనుమార్పులు సంభవిస్తాయి. ఒక టన్ను వ్యర్థాలు తగలబెట్టడం వల్ల 60 కిలోల కార్బన్‌మోనాక్సైడ్‌తో పాటు 1,400 కిలోల కార్బన్‌డైయాక్సైడ్ గాలిలోకి విడుదలవుతాయి. ఇదే కాకుండా సూక్ష్మధూళి కణాలు, బూడిద గాలిలో కలవడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. అలాగే నేల పొరల్లోని తేమ శాతం ఆవిరై దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయి.



కాలుతున్న వరి కొయ్యల వల్ల వెలువడుతున్న కాలుష్యం